క్లుప్తంగా

రేపటి నుంచి పోలేరమ్మ ఉత్సవాలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని కాలేజీ రోడ్డులో ఉన్న పోలేరమ్మ దేవస్థానం తృతీయ వార్షికోత్సవాన్ని ఈ నెల 3వ తేదీన నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 10 గంటలకు అమ్మవారికి బోనాలు సమర్పిస్తామని అనంతరం లలిత సహస్ర నామ పారాయణం, మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని ప్రారంభించాలి



నూతనంగా ఎన్నికైన ఎస్ఎఫ్ఐ కమిటీ

మార్కాపురం టౌన్: మార్కాపురంలో మెడికల్ కళాశాల నిర్మాణాన్ని ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ మండల ప్లీనరీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మార్కాపురాన్ని ప్రత్యేక జిల్లా చేయడంతోపాటు ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. మధ్యలోనే ఆపిన మెడికల్ కళాశాల నిర్మాణాన్ని ప్రభుత్వం పూర్తిచేయాలన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మార్కాపురం వచ్చినప్పటికీ వాటిపై ఎలాంటి హామీ ఇవ్వలేదన్నారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా నాగరాజు, సుదీప్, ఉపాధ్యక్షుడిగా సుభాకర్ తదితరులను ఎన్నుకున్నారు.

చెరువులను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

గిద్దలూరు రూరల్: మండలంలోని నల్లగట్ల గ్రామ సమీపంలో గల మైనర్ ఇరిగేషన్ చెరువు, కొత్తపల్లె గ్రామంలో కొండగాడి కుంటలను స్థానిక ఇరిగేషన్ డీఈ రామారావు శుక్రవారం పరిశీలించారు. గతంలో వర్షాల కారణంగా చెరువు కట్ట తెగిపోవడం, ఆయకట్టు రోడ్డు, పంట కాలువల్లో పూడికతీత పనులపై ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు డీఈ తెలిపారు. ఆయన వెంట ఏఈ వెంకటరామిరెడ్డి, వర్క్ఇన్స్పెక్టర్లు బొర్రా శేఖర్‌యాదవ్, శ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచ్ రామసుబ్బారెడ్డి, రైతులు ఉన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎం నరసింహులు

మార్కాపురం: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి అని ఆర్టీసీ డీఎం నరసింహులు అన్నారు. మార్కాపురం డిపోలో కండక్టర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన ఎన్ఎంయూ సెక్రటరీ కాశయ్య అభినందన సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సేవ చేస్తూ అధికారుల మన్ననలు పొందిన కాశయ్య సేవలు మరువలేమన్నారు. 35 సంవత్సరాలుగా ఆర్టీసీలో ఆయన సేవలు అందించడం అభినందనీయమన్నారు. అనంతరం కాశయ్యను ఆర్టీసీ సిబ్బంది సన్మానించారు.

ఆలయాల్లో శ్రావణ మాస పూజలు



వెలుగొండ క్షేత్రంలో భక్తుల పూజలు

కొనకనమిట్ల: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. వెలుగొండస్వామి క్షేత్రం, కొనకనమిట్ల రామధూత క్షేత్రం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి, సలనూతల రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో వేదపండితులు భక్తులకు శ్రావణ మాసం విశిష్టతను వివరించారు.

క్షుద్రపూజల కలకలం

కురిచేడు: పంట పొలాల్లో క్షుద్రపూజలంటూ కలకలం రేగింది. గుర్తు తెలియని వ్యక్తులు దర్శి రోడ్డులోని మూలె నర్సింహారెడ్డి పొలంలో మనిషి బొమ్మ ఆకారంలో ముగ్గులు వేసి నిమ్మకాయలు కోసి కొబ్బరి కాయలు కొట్టి పసుపు కుంకుమ చల్లారు. అక్కడ ఒక సీటిబిందె, చీర, లంగా, జాకెట్, ప్యాంట్‌తో పాటు చిన్న కత్తి, కుండను పగలకొట్టిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. రైతులు ఆ వైపు వెళ్లేందుకు భయపడుతున్నారు.

బీమాకు చంద్ర గ్రహణం!

- ప్రమాద బీమా కోసం 13 నెలలుగా ఎదురుచూపులు
- కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్భాట ప్రకటన
- 2024 మార్చి నుంచి అర్హులైన కుటుంబాలకు మొండిచేయి
- అధికారంలోకి వచ్చాక పథకం ఊసెత్తని రాష్ట్ర ప్రభుత్వం

బేస్తవారిపేట: ఎన్నికల సమయంలో గద్దెనెక్కేందుకు కూటమి నాయకులు అనేక హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక పథకాల అమలును కూటమి సర్కారు గాలికొదిలేసింది. కనీసం బీమా పథకమైనా అమలు చేస్తే కాస్త భరోసా ఉంటుందని పేద ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. పథకం పేరును చంద్రన్న బీమాగా మార్చిన ప్రభుత్వం అమలు చేసే విషయాన్ని మాత్రం గాలికొదిలేసింది. దీంతో సహజ మరణంతోపాటు ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబాలు ఏడాదికాలంగా పరిహారం కోసం ఎదురుచూస్తున్నాయి. అసలు బీమా పథకం ఇస్తారా..ఎత్తేస్తారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దారిద్ర్యరేఖకు దిగువగా ఉన్నవారు, అంత్యోదయ, తెల్ల రేషన్ కార్డులు కలిగిన వారంతా బీమా పథకానికి అర్హులు. గిద్దలూరు నియోజకవర్గంలో గడిచిన ఏడాది కాలంలో వివిధ కారణాలతో మృత్యువాతపడినవారు సుమారు 450 మందికి పైగా ఉన్నారు. బీమా పథకం అమలు చేస్తారో లేదోనని ఈ కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.

గత ప్రభుత్వంలో పక్కాగా..

గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ బీమాను అమలు చేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి పేదోడికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయూతనందించారు. అధికారులు నేరుగా బాధితుల వద్దకే వెళ్లి బీమా సొమ్ము అందించారు. సవ్యంగా సాగుతున్న ఈ పథకానికి సార్వత్రిక ఎన్నికల తర్వాత గ్రహణం పట్టింది.

రూ.10 లక్షల హామీ ఏమైంది..

'బీమా పథకంలో సమూల మార్పులు తెస్తాం. అర్హులందరికీ న్యాయం చేస్తాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చినదానికి రెట్టింపు సాయం అందిస్తాం'ని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీలు గుప్పించారు. సహజ మరణానికైతే రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షలు ఇస్తామంటూ కూటమి నాయకులు ఎన్నికలప్పుడు ఊరూరా తిరిగి ప్రచారం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలోనూ ముద్రించి ఇంటింటికి పంచి పెట్టారు. అధికారం చేపట్టాక ఎప్పటిలాగే మరిచిపోయారు. 2024 మే 13 నుంచి బీమా పథకం వివరాలు వెబ్‌సైట్ నుంచి తొలగించారు. తర్వాత నమోదుకు అవకాశం కల్పించలేదు. అప్పటి నుంచి ఎన్నో కుటుంబాలు రోడ్డుపాలై బీమా కోసం ఎదురుచూపులు చూడాల్సిన దుస్థితి నెలకొంది.



టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో బీమా

మార్గదర్శకాలు వెలువడలేదు

ప్రభుత్వం నుంచి బీమా పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు ఇంకా వెలువడలేదు. ఈ పథకానికి సంబంధించిన వెబ్‌సైట్ ఆన్‌లో లేదు. మార్గదర్శకాలు వచ్చిన వెంటనే పథకాన్ని అమలు చేస్తాం.

– రఘునాథబాబు, ఏపీఎం, బేస్తవారిపేట

కుటుంబానికి అండ బీమా



కూలీ పనులు చేసుకుని జీవించే కుటుంబాలకు బీమా ఎంతో అండగా ఉంటుంది. బీమా రూ.10 లక్షలకు పెంచి సహాయం అందిస్తామని కూటమి నాయకులు చెప్పారు. నేడు బీమా పథకం గురించి ఎవరూ మాట్లాడటం లేదు. ప్రమాదవశాత్తు ఎందరో మృత్యువాతపడుతున్నారు. పథకం అమల్లో ఉంటే కుటుంబానికి ఆర్థిక భరోసా అందేది. ప్రభుత్వం వెంటనే పథకాన్ని అమల్లోకి తీసుకురావాలి.

– జోసఫ్, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

గిద్దలూరు రూరల్: ఆటో కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని సీఐటీయు కార్యాలయంలో శుక్రవారం ఆటో వర్కర్ల యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం దెబ్బతినడం, నిరుద్యోగం పెరగడం వల్ల ఎక్కువ మంది యువత ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నారు. అటువంటి కార్మికులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఆటో కార్మికులకు ప్రభుత్వం ట్యాక్స్, ఇన్సూరెన్స్ పేరుతో జరిమానాలు విధించి ఆర్థికంగా నష్టపరచడం సరికాదన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులను అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఆటో వర్కర్ల యూనియన్ నాయకులు జి.రాజు, ఉస్మాన్, బాలగురవయ్య, విజయవర్ధన్, రంగస్వామి, చాంద్‌భాష తదితరులు పాల్గొన్నారు.



గిద్దలూరులో మాట్లాడుతున్న ఆవులయ్య

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

అర్ధవీడు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శి షేక్ అన్వర్‌బాషా డిమాండ్ చేశారు. శుక్రవారం అంకభూపాలెం, పాపినేనిపల్లి గ్రామాల్లోని భవన నిర్మాణ కార్మికులతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. ఎన్నో ఏళ్లు పోరాడి కార్మికులు సాధించుకున్న సంక్షేమ బోర్డును కూటమి ప్రభుత్వం నీరు గారుస్తోందని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదన్నారు. సెప్టెంబర్ 15వ తేదీలోగా బోర్డును పునరుద్ధరించి, క్లెయిములను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అదే రోజు కార్మిక శాఖ రాష్ట్ర కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, ఇప్పటికే బిగించిన వాటిని తొలగించాలని, ట్రూ అప్, ఇందన సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా మండ్ల వలి, నల్ల బోతుల శ్రీను, ఉపాధ్యక్షులుగా మండ్ల నాగేశ్వరావు, రాజశేఖర్, సహాయ కార్యదర్శులుగా కట్టా రవి, పిక్కిలి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా పోలేపల్లి రామకృష్ణ, మరికొందరు సభ్యులు ఎన్నికయ్యారు.



చిల్లచెట్లతో నిండిపోయిన యడవల్లి చెరువు



నీరు లేని గుడిమెట్ట చెరువు

చెరువులా.. అడవులా?

- చిల్లచెట్లతో నిండిన చెరువు గర్భాలు
- దెబ్బతిన్న తూములు, చెరువుకట్టలు
- రూపు కోల్పోయిన పంట కాలువలు
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- ఎండుతున్న పంట పొలాలు

రాచర్ల: సాగునీటి వనరులను అందుబాటులోకి తెచ్చి రైతులకు మేలు చేయాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెరువులు నిండితే భూగర్భ జలాలు సైతం వృద్ధి చెంది డీప్‌బోర్లకు పుష్కలంగా నీరొచ్చే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం చెరువులకు చుక్క నీరు కూడా చేరే పరిస్థితి కానరావడం లేదు. చెరువుల అంతర్భాగం పూర్తిగా చిల్లచెట్లతో నిండిపోవడంతో పాటు పంట కాలువలు రూపు కోల్పోవడమే అందుకు కారణం. దెబ్బతిన్న తూములు, కట్టల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాల్సిన ప్రభుత్వం ఏడాది కాలంగా పైసా విదల్చకపోవడంతో చెరువుల కింద ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది.

రాచర్ల మండలంలోని అనుములపల్లె, జేపీ చెరువు, ఆరవీటికోట, చోళ్లవీడు, ఆకవీడు, పాలకవీడు,యడవల్లి, గంగంపల్లె, గుడిమెట్ట, సత్యవోలు గ్రామాల్లో మైనర్ ఇరిగేషన్ చెరువు కింద దాదాపు 2,335 ఎకరాలు, పంచాయతీరాజ్ పరిధిలోని 16 చెరువుల కింద 334 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆయా చెరువులకు మరమ్మతులు చేపట్టేందుకు నిధులు లేకపోవడంతో అధికారులు వాటివైపు కన్నెత్తి చూడటం లేదు. ప్రస్తుతం రాచర్ల మండలంలో బోర్ల కింద పత్తి, ఆముదం, నువ్వులు, చిక్కుడు, మొక్కజొన్న, పచ్చిమిర్చి, టమోటా తదితర పంటలు సాగు చేస్తున్నారు. వర్షాలు సక్రమంగా కురవక, అరకొరగా పడినప్పటికీ వరద నీరు చెరువులకు చేరకపోవడంతో భూగర్భజలాలు అడుగంటాయి. బోర్లకు నీరు అందకపోవడంతో పొలాలు ఎండుముఖం పడుతున్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బోర్లకు నీరందడం లేదు



గంగమ్మ చెరువు ఆయకట్టు కింద 2 ఎకరాల మాగాణితోపాటు 3 ఎకరాల మెట్ట భూమి ఉంది. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో గంగమ్మ చెరువులో చుక్క నీరు లేదు. బోర్లకు నీరు తగ్గిపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించింది.

– మీనిగ.రామిరెడ్డి, పత్తి రైతు, గంగంపల్లె



గుడిమెట్ట చెరువు ఆకయట్టు భూమిని బీడు పెట్టిన రైతులు



జి.కొత్తపల్లిలో డీప్‌బోరుకు అరకొరగా వచ్చే నీటిని చిక్కుడు పంటకు పెడుతున్న రైతు

పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అడ్డుకట్ట

యర్రగొండపాలెం: అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి అడ్డుకట్ట వేస్తోందని పలువురు సర్పంచ్‌లు ఆరోపించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులను సైతం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదని, ఆ నిధులను కూడా పక్కదోవ పట్టిస్తున్నారన్నారు. 2024–25 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం రెండో విడతగా రూ.1,129 కోట్లు స్థానిక సంస్థలకు మంజూరు చేసిందని, ఆ నిధులు విడుదలై దాదాపు 7 నెలలు కావస్తున్నా కూటమి ప్రభుత్వం ఆయా పంచాయతీలకు జమ చేయలేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధి కోసం విడుదల చేసిన నిధులను కూటమి ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా సంక్షేమ పథకాలకు వినియోగించుకుందని, దీంతో పంచాయతీల అభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీల్లో మౌలిక వసతులు తాగునీరు సరఫరా, పారిశుధ్య నిర్వహణ కోసం సర్పంచ్‌లు తమ సొంత నిధులు ఖర్చు పెట్టి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి 15వ ఆర్థిక సంఘం నిధులు వెంటనే విడుద చేసి పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కర్నాటి వెంకటేశ్వరరెడ్డి, ఆయా పంచాయతీల సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, ఏకుల జయమ్మ ముసలారెడ్డి, పబ్బిశెట్టి శ్రీనివాస్ పద్మావతి, ఆవుల నారాయణమ్మ, తమ్మినేని సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే అమృతం

- ఐసీడీఎస్ పీడీ సువర్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ సువర్ణ

పొదిలి రూరల్: బిడ్డకు తల్లి అందించే అమృతం ముర్రుపాలు అని ఐసీడీఎస్ పీడీ సువర్ణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పొదిలి, కొనకనమిట్ల మండలాల కార్యకర్తలకు ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీ మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈనెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి తల్లిపాలు ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం ఉత్తమ తల్లులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ సుధామారుతి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యత తెలియజేయాలి

గిద్దలూరు రూరల్: తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ పీడీ సువర్ణ సూచించారు. పట్టణంలోని సీడీపీఓ కార్యాలయంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలను పట్టాలని ఆరు నెలల వరకు తల్లిపాలను తప్పకుండా అందించాలన్నారు. ఆరునెలల నుంచి అనుబంధ పోషక ఆహారం మొదలు పెట్టాలని తల్లులకు తెలియజేయాలన్నారు. ప్రతి రెండో శనివారం కిశోర బాలికలతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. లబ్ధిదారులకు అందించే పౌష్టికాహారంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీఓ జ్యోతి, సూపర్ వైజర్ వసంతకుమారి, గిద్దలూరు, కొమరోలు, రాచర్ల మూడు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్ధవీడు: మండలంలోని అంగనువాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. బిడ్డకు రెండేళ్ల వరకు తల్లిపాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తల్లులకు కార్యకర్తలు సూచించారు. తల్లిపాలపై అవగాహన కల్పిస్తూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

కష్టజీవుల హక్కులను హరిస్తున్న పాలకులు

- వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల



మాట్లాడుతున్న ఆంజనేయులు

మార్కాపురం: దశాబ్దాల పోరాటం ఫలితంగా సాధించుకున్న హక్కులు, చట్టాలను నేటి పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు విమర్శించారు. శుక్రవారం స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భూస్వాములు, జమిందారులు, నైజాం నవాబులు, పెత్తందారులకు వ్యతిరేకంగా చేసిన పోరాటాల ఫలితంగా భూ సంస్కరణ చట్టం వచ్చిందన్నారు. కూలీల సంక్షేమానికి సైతం చట్టాలు చేశారన్నారు. అయితే ప్రస్తుత పాలకులు శ్రమజీవులను విస్మరించి కార్పొరేట్ శక్తులకు దాసోహమంటున్నారని, మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని, కార్మికుల చట్టాలను రద్దు చేస్తోందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య మాట్లాడుతూ కరువుకాటకాల వలన ప్రజలు వలసలు పోతున్నారని, పశ్చిమ ప్రకాశం మొత్తం కరువుతో అల్లాడుతోందన్నారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి రూబెన్ మాట్లాడుతూ.. వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో తురకా ఏడుకొండలు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజు, కోటమ్మ, అల్లూరయ్య, గాలెయ్య, అల్లూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎల్లమ్మతల్లి ఆలయ ప్రతిష్ట మహోత్సవం



ముస్తాబైన ఎల్లమ్మతల్లి ఆలయం

కొనకనమిట్ల: మండలంలోని ఇరసలగుండం గ్రామంలో నూతనంగా నిర్మించిన నాగారపు ఎల్లమ్మతల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం నుంచి మూడు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం గణపతి పూజతో ప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభమవుతాయని, ఆదివారం అమ్మవారి విగ్రహాల గ్రామోత్సవం, రాత్రికి బొల్లావుల ఉత్సవం, సోమవారం శిఖర కళశం, ఎల్లమ్మతల్లి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని వివరించారు. స్వరూపానందగిరి స్వామి ప్రవచనం అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేయనున్నట్లు చెప్పారు.

సలనూతల శివాలయంలో పూజలు



శివాలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొనకనమిట్ల: మండలంలోని సలనూతల గ్రామంలో రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మాజీ సర్పంచ్ అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నేతల మేలు కోరుతూ పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మార్కాపురం ఇన్‌చార్జి అన్నా రాంబాబు, అక్రమ కేసుల్లో జైలు శిక్ష ఎదుర్కొంటున్న నాయకులకు మంచి జరగాలని కాంక్షిస్తూ పూజలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురవాలని గంగమ్మ తల్లిని పూజించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సానికొమ్ము వెంకట సుబ్బారెడ్డి, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, ముప్పా అనంతరెడ్డి, బత్తుల చిన్న శ్రీను, ముప్పా వెంకటేశ్వరరెడ్డి(పెద్దోడు), ముప్పా వెంకటేశ్వరరెడ్డి, శ్యామల లక్ష్మీరెడ్డి, పిక్కిలి పెద కాశయ్య, దేవిరెడ్డి అంజిరెడ్డి పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశం బహిష్కరణ

యర్రగొండపాలెం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్‌తో పాటు ఎంపీటీసీ సభ్యులు బహిష్కరించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం ప్రారంభమైన వెంటనే వారు సమావేశాన్ని బహిష్కరించారు. ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మండల అభివృద్ధికి సభ్యులు ఆమోదం తెలిపిన తీర్మానాలకు ఎంపీడీవో బి.శ్రీనివాసులు ఇప్పటి వరకు అడ్మిని స్ట్రేషన్ శ్యాంక్షన్ ఇవ్వలేదని, దీంతో మండలం అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు. ఎంపీడీవో కూటమి నాయకుడికి వత్తాసు పలుకుతూ ఆయన చెప్పు చేతుల్లో పనిచేస్తున్నాడని, మెజార్టీ సభ్యులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కావడంతో తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోకుండా ఉండేందుకు ఆమోదం తెలిపిన తీర్మానాలకు అడ్మినిస్టేషన్ శ్యాంక్షన్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నాడని మండిపడ్డారు. ఈ సంవత్సరం జనవరి 10వ తేదీన జరిగిన సమావేశంలో తీర్మానించి ఆమోదించిన 12 అంశాల్లో ఏ ఒక్క అంశాన్ని ఎంపీడీవో అమలు చేయలేదని, ఈ విషయంపై మండల పరిషత్ సమావేశంలో నిలదీస్తామన్న భయంతో ఆయన ఆ తర్వాత జరిగిన సమావేశాలకు హాజరు కాలేదని ఆరోపించారు. మండలంలో జరిగే అభివృద్ధి పనులకు ఎంపీడీవో జాప్యం చేయడం ఏంటని వారు ప్రశ్నించారు. ఈ విషయంపై కలెక్టర్ తమీమ్ అన్సారియా జోక్యం చేసుకొని తగిన చర్యలు తీసుకోవాలని, మండల అభివృద్ధికి పాటుపడాలని వారు కోరారు.